క్లుప్తంగా

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ విభాగం బీసీ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణను శుక్రవారం ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ సర్కిల్ ఎస్ఈ ఎ.సురేందర్, సంఘం జిల్లా అధ్యక్షుడు(ఏడీఈ) సీహెచ్.నాగార్జున, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నాగేశ్వరరావు, మమత, వెంకటేశ్వర్లు, ఫ్రాంక్లిన్, రవికుమార్ కిరీటి తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మ' కమిటీ చైర్మన్‌గా శివరామకృష్ణ

కూసుమంచి: వ్యవసాయశాఖ పరిధిలోని ఆత్మా పాలేరు డివిజన్ కమిటీ చైర్మన్‌గా తిరుమలాయపాలెం మండలానికి చెందిన చావా శివరామకృష్ణ నియమితులు కానున్నారు. ఈమేరకు శుక్రవారం కూసుమంచిలోని రైతు వేదికలో జరిగిన సమావేశంలో చైర్మన్‌తో పాటు 30 మంది డైరెక్టర్ల పేర్లను కూసుమంచి ఏడీఏ సరిత, ఏఓల సమక్షాన ఏకగ్రీవంగా తీర్మానించారు. కలెక్టర్ ఆమోదం తరువాత కమిటీని అధికారికంగా ప్రకటించనున్నారు.

వివేకానంద జయంతి



నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 12వ తేదీన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నేషనల్ యూత్ డేను శుక్రవారం నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏజీ రామారావు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జీవిత చరిత్రను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ రామకుమారస్వామి, రమేష్, శ్యామలదేవి, సూర్యలక్ష్మి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్‌బీజీఎన్ఆర్'లో హిందీ భాషా దినోత్సవం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఈ సందర్భంగా హిందీ భాషా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో హిందీ విభాగాధిపతి డాక్టర్ గౌసియా, అధ్యాపకులు డాక్టర్ మధు, ఎల్.ఎస్.శాస్త్రి, బానోత్ రెడ్డి, వీరన్న, నర్సమ్మ, రమాసత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని పీజీ కళాశాల ఆడిటోరియంలో '75 వసంతాల భారత రాజ్యాంగం స్వేచ్ఛ సమానత్వం సవాళ్లు' అనే అంశంపై తెలంగాణ చైతన్య వేదిక ఆధ్వర్యాన ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని వేదిక కన్వీనర్ ములక సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన వక్తలుగా సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, రిటైర్డు లెక్చరర్ కూరపాటి వెంకటనారాయణ పాల్గొంటారని పేర్కొన్నారు.

సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంఅర్బన్: నగర పాలక సంస్థ పరిధిలోని మధురానగర్ వాస్తవ్యుడు, అఖిల భారత యువ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి తండ్రి హుస్సేన్ మృతి పట్ల మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అంతేకాక డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, జీవన్‌కుమార్, వలరాజు, ప్రసాద్‌రావు, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం అర్బన్ సెక్షన్ పరిధిలో ఇందిరానగర్ మసీదు ఏరియాలో శుక్రవారం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉన్న 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరొకటి ఏర్పాటు చేశారు. కాగా, ఖమ్మంటౌన్ డివిజనల్ ఇంజనీర్ ఎస్.రామారావు, ఏడీఈ యాదగిరి, ఏఈ కె.నాగేశ్వరరావు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించి, వేసవి కాలంలో ఏర్పడే లో వోల్టేజీ సమస్యలను అధిగమించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు.

'ఎస్ఎఫ్ఎస్' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో నగరంలోని బల్లేపల్లిలో గల ఎస్ఎఫ్ఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని పాఠశాల కరస్పాండెంట్ రాజారెడ్డి తెలిపారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగిన ఈ పోటీల్లో ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో తమ స్కూల్ విద్యార్థులు టి.సత్యసాయి, సీహెచ్.యశ్వంత్ స్మార్ట్ కార్ అండ్ స్మార్ట్ కమ్యూనికేషన్ ప్రాజెక్ట్ ద్వారా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారన్నారు. ఈమేరకు శుక్రవారం కరస్పాండెంట్‌తో పాటు పాఠశాల ప్రిన్సిపాల్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ గైడ్ టీచర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి



ఖమ్మంలోని రంగనాయకుల గుట్టపై స్వామివారు



ఖమ్మంగాంధీచౌక్: కమాన్‌బజార్ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయాల్లో ఏడాదికోసారి తెరిచే ఉత్తర ద్వారం నుంచి స్వామి దర్శనం కోసం భక్తులు తెల్ల వారుజామునే ఆలయాలకు చేరుకున్నారు. భక్తజనకోటి హారతుల నడుమ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ నిర్వాహకులు బారికేడ్లు ఏర్పాటు చేయగా.. భక్తుల రాకతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి.
– సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: జీళ్లచెరువులో స్వామివారిని పల్లకీలో తీసుకొస్తున్న భక్తులు



ఖమ్మంరూరల్: ఏదులాపురంలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



ఖమ్మంగాంధీచౌక్: రంగనాయకుల గుట్టపై స్వామి వారికి ప్రత్యేక పూజలు





ఖమ్మంగాంధీచౌక్: కమాన్‌బజార్ ఆలయంలో స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు



ఖమ్మంలోని భక్త ఆంజనేయ స్వామి ఆలయంలో..



ఖమ్మంఅర్బన్: యూపీహెచ్‌కాలనీలో శ్రీఅభయ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం పోటెత్తిన భక్తులు

'ఆశ'లు నెరవేరాలని ధర్నా..



ఆశా వర్కర్లతో కలిసి ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 వేలు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని, పదోన్నతులు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. గతేడాది రాష్ట్రవ్యాప్తంగా 15 రోజుల పాటు ఆశా వర్కర్లు నిరవధిక సమ్మె చేపట్టినప్పుడు ఐఏఎస్ ఆఫీసర్ ఆధ్వర్యాన కమిటీ వేసి ఆశాల సమస్యలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేలా చర్యలు తీసుకుంటామన్నారని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఆశాలకు వేతనాలు పెంచుతామని హామీనిచ్చిందని పేర్కొన్నారు. అంతేకాక ఆరోగ్య శాఖ కమిషనర్ ఆఫీస్ ముందు జరిగిన ధర్నా, చర్చల సందర్భంగా కమిషనర్ స్పందిస్తూ రూ.50 లక్షల ఇన్సూరెన్స్ ఇస్తామని, ఇతర సమస్యలను పరిష్కరిస్తామని నిర్దిష్టమైన హామీలు ఇచ్చినట్లు తెలిపారు. పై అంశాల్లో ఒక్క సమ్మెకాలం వేతనాలు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందని, ఇతర సమస్యలు నేటికీ పరిష్కరించలేదన్నారు. ఇకనైనా ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, జిల్లా ఉపాధ్యక్షుడు పి.రమ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు జై.మంగమ్మ, జిల్లా నాయకులు రమణ, నాగమణి, ఝాన్సీ, జ్యోతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన

నేలకొండపల్లి/కూసుమంచి/ఖమ్మంమామిళ్లగూడెం/తిరుమలాయపాలెం/రఘునాథపాలెం/ఖమ్మంరూరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలాల్లో శుక్రవారం నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. అనంతరం ప్రతిభ చూపిన వారిని బహుమతులు అందించారు. ఈనేపథ్యాన నేలకొండపల్లి, కూసుమంచిలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సారథ్యాన నిర్వహించగా.. నేలకొండపల్లి పోటీలకు మంత్రి పొంగులేటి సతీమణి మాధురి హాజరై విజేతలకు బహుమతులు అందించారు. అలాగే కూసుమంచిలో మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయాల ఇన్‌చార్జ్‌లు తుంబూరు దయాకర్‌రెడ్డి, భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముగ్గులను పర్యవేక్షించారు. ఖమ్మం నగరంలోని 53వ డివిజన్‌లో బీజేపీ జిల్లా నాయకుడు వెంకటనారాయణయాదవ్, డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ శ్రీలత ఆధ్వర్యాన పోటీలు నిర్వహించగా, 23వ డివిజన్‌లో కార్పొరేటర్ షేక్ మక్బూల్ ఆధ్వర్యంలో స్థానిక శాంతినగర్ పాఠశాల ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతేకాక తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, రఘునాథపాలెం మండలం యూపీఎస్ గణేశ్వరం పాఠశాలలో, నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. అదేవిధంగా ఖమ్మంరూరల్ మండలంలోని గోళ్లపాడు పోలేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించడంతో పాటు విద్యార్థులు హరిదాసు వేషధారణలో, బుర్రకథలు, గంగిరెద్దుల వేషధారణలో పలువురిని ఆకట్టుకున్నారు.



నేలకొండపల్లి: బహుమతులు అందిస్తున్న మంత్రి పొంగులేటి సతీమణి మాధురి



ఖమ్మంమామిళ్లగూడెం: 23వ డివిజన్‌లో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



ఖమ్మంరూరల్: గోళ్లపాడు-పోలేపల్లి ఉన్నత పాఠశాలలో హరిదాసు వేషధారణలో విద్యార్థి

నేడు విద్యుత్ అంతరాయం

☞ కామేపల్లి: పాన్నేకల్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు(శనివారం) 9 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

☞ నేలకొండపల్లి: మండలంలోని కొత్త కొత్తూరు, సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉండదని ఏఈ కె.రామారావు తెలిపారు.

☞ కూసుమంచి: జీళ్లచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, కూసుమంచి ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ అశోక్ తెలిపారు. అలాగే పెరికసింగారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు ఏఈ తావుర్యా తెలిపారు.

☞ ఖమ్మంవ్యవసాయం: నగరంలోని గాంధీచౌక్, దానవాయిగూడెం సబ్ స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తలగింపు కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని టౌన్-1 సెక్షన్ ఏఈ క్రాంతిసింహ తెలిపారు.

☞ ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండా, గుర్రాలపాడు సబ్‌స్టేషన్‌ల పరిధిలో 11 కేవీ జలగంనగర్, 11కేవీ వెంకటగిరి టౌన్ ఫీడర్లలో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా బంద్ ఉంటుందని ఏఈ ప్రభాకర్ రావు తెలిపారు.

ఆర్ఎంపీలపై దాడులు ఆపాలి

కామేపల్లి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నిత్యం సేవలందిస్తున్న గ్రామీణ వైద్యులపై తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త లింగాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం 25వ వార్షికోత్సవ వేడుకలను మండల అధ్యక్షుడు బందెల నాగేశ్వరరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎంపీలు అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్సకే పరిమితం కావాలని, పరిమితికి మించి వైద్యం చేయొద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లను జారీ చేస్తామని హామీ ఇచ్చి మరచిందన్నారు. అనంతరం సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు అమృతరావు, సుందర్‌రావు, రాము, మహబూబ్‌రెడ్డి, అప్పారావు, రమేశ్, సతీశ్, ఇమామ్, మనోజ్, రాంబాబు, సాంబశివరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. అనంతరం పండుగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. – ఖమ్మం సహకారనగర్



చిన్నారులపై భోగి పండ్లు పోస్తున్న రెజొనెన్స్ ఇన్ఫో డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ, శ్రీధర్‌రావు



ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



విద్యార్థులను ఆశీర్వదిస్తున్న విద్యాక్షేత్ర కరస్పాండెంట్ సౌభాగ్య

వినతుల వెల్లువ..

● అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి

తిరుమలాయపాలెం: అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మేడిదపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ విషయంలో రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులకు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని, భూ సమస్యలు పరిష్కరించి పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మండల కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బింగి రమేష్, సుధాకర్, వేగినాటి మంగతాయి, కొత్తపల్లి వెంకన్న, దాసరి మహేందర్, మోర ఉపేందర్‌రెడ్డి, తుళ్లూరు నాగేశ్వరరావు, పులకాని వెంకటనర్సయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● నిత్యావసర ధరలను అరికట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఐద్వా ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ రాజేశ్వరికి సమస్యలపై వినతి పత్రం అందజేసింది. ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరచాలని, కేరళ తరహాలో 14 రకాల నిత్యావసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా అందించాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని, కోరుతూ జిల్లా వ్యాప్తంగా సేకరించిన సంతకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, ఐద్వా రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి మాట్లాడుతూ రేషన్ షాపుల్లో ఇచ్చే బియ్యాన్ని పేదలు తినే పరిస్థితి లేదని, మనిషికి 15 కిలోల సన్నబియ్యం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని, కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు రమణ, బండి పద్మ, జిల్లా ఆఫీస్ బేరర్లు మేహరున్నిసా బేగం, సుమతి, కె.అమరావతి జిల్లా నాయకురాలు భాగం అజిత, ఎస్.పావని, ఎస్‌కె.బిబీ తదితరులు పాల్గొన్నారు.

● కౌలు రైతులకూ 'భరోసా' ఇవ్వాలి

నేలకొండపల్లి/కూసుమంచి: కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం వర్తింపజేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను స్థానిక తహసీల్దార్లకు అందించారు. నేలకొండపల్లిలో సుధాకర్, కూసుమంచిలో ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎటువంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు విడుదల చేయాలని, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎం ఫసల్ భీమా యోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండల అధ్యక్షుడు కొత్తా శ్రీనివాసరెడ్డి, కిసాన్ మోర్చా మండల కన్వీనర్ కల్యాణపు నాగేశ్వరరావు, ఎలిగేటి నరసింహారావు, రాపల్లి కొండలు, కొండా హర్షవర్ధన్, కందరబోయిన గోపి, చందా ప్రవీణ్, గుండెపొంగు క్రాంతి, మహేందర్ నాయక్, చంద్రశేఖర్,వెంకటరెడ్డి,దుర్గయ్య, వేణు తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మంలో కేఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

● అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని వైరా రోడ్డులో గల పెట్రోల్ బంకు వెనక ప్రాంతంలో ఓ ప్రజాప్రతినిధి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ మాట్లాడుతూ.. వైరా రోడ్, బైపాస్ రోడ్‌లో ఎటువంటి సెట్ బ్యాక్ లేకుండా, అనుమతులు పూర్తిస్థాయిలో లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, ఇటువంటి అక్రమాలపై పార్టీ ఆధ్వర్యాన వినతులు ఇస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారికే వత్తాసు పాడేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు స్పందించకుంటే ఆందోళనలకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జె.వెంకన్నబాబు, సీహెచ్.భద్రం, పి.నాగేశ్వరరావు, జె.ఉపేందర్, నరసింహారావు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామలింగారెడ్డి

తిరుమలాయపాలెం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తిరుమలాయపాలెం-2 ఎస్ఐ రామలింగారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరస్తులు డిజిటల్ అరెస్టు పేరుతో ఫోన్లు చేసి అకౌంట్లోని డబ్బులు కాజేస్తున్నారని, ఇటువంటి మోసాలబారిన పడినట్లయితే వెంటనే సైబర్ క్రైమ్ 1930కు కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ హరికృష్ణ, పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలి



ఖమ్మంలో ప్రదర్శన చేస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేస్తూ, నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు సంఘం నేత జగ్జిత్‌సింగ్ దలైవాల్‌కు మద్దతుగా శుక్రవారం సీపీఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన ప్రదర్శన నిర్వహించారు. సుందరయ్య భవన్ నుంచి సరితా క్లీనిక్ సెంటర్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ దేశంలో రైతులు ఆత్మహత్య చేసుకునేలా మోదీ విధానాలు ఉన్నాయని ఆరోపించారు. జగ్జిత్‌సింగ్‌కు ఏమైనా జరిగితే మోదీ బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, వైరా డివిజన్ కార్యదర్శి భుక్యా వీరభద్రం, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యాన రైతు దీక్ష

కూసుమంచి: రైతునేత జగ్జిత్‌సింగ్ దలైవాల్ చేపట్టిన దీక్షకు మద్దతుగా శుక్రవారం కూసుమంచి మండలకేంద్రంలో సీపీఎం ఆధ్వర్యాన రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకుడు మల్లెల హన్మంతరావు మాట్లాడగా.. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తోటకూరి రాజశేఖర్, కార్యదర్శి బిక్కసాని గంగాధర్, గురుమూర్తి, రమణారెడ్డి, వెంకటేశ్వరరావు, గన్యానాయక్, పాపయ్య, శ్రీను, ఉపేందర్, మాధవరావు, వెంకట్రామయ్య పాల్గొన్నారు.